ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

శుక్రవారం 5 జూలై 2024

రేపు నల్సర్‌కు సీఎం, హైకోర్టు సీజే రాక

శామీర్‌పేట, జులై 4: శామీర్‌పేటలోని నల్సర్ న్యాయ విశ్వవిద్యాలయంలో ఈ నెల 6న సాయంత్రం 4గంటలకు క్యాపిటల్ ఫౌండేషన్ వార్షిక ప్రసంగం, అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ శ్రీకృష్ణదేవరావు గురువారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గౌరవ అతిథులుగా వర్సిటీ చాన్స్‌లర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరదే, అటార్నీ జనరల్ ఆఫ్ ఇండియా వెంకటరమణి రానున్నారని చెప్పారు.



ఆపరేషన్ ముస్కాన్-10 పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు

- జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి

మేడ్చల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి అన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్-10 సమన్వయ సమావేశాన్ని గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు హాజరైన ఈ సమావేశంలో కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. బడీడు పిల్లలు కార్మికులుగా ఎక్కడ పనిచేసినా, వారితో వెట్టి చాకిరీ చేయించినా, అక్రమ రవాణా, భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించినా వెంటనే 1098కు కాల్ చేయాలన్నారు. ఈ నంబరు 24గంటలు అందుబాటులో ఉంటుందని, ఆపదలో ఉన్న బాల, బాలికల రక్షణ, సంరక్షణ కొరకు ఈ నంబర్ పనిచేస్తుందని, కాల్‌చేసిన వెంటనే వివిధ శాఖల అధికారులు అందుబాటులోకి వస్తారన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా వీధిబాలలు, అనాథలు, నిరాశ్రయులైన బాలలను గుర్తించి దర్పణ్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేసి వారిని తల్లిదండ్రులకు అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్మన్ రాజారెడ్డి, సభ్యులు అర్చన, నాగజయశ్రీ, డీఎంహెచ్‌వో రఘునాథస్వామి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ యాదయ్య పాల్గొన్నారు.



అధికారులు, ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

- 'ధరణి' సమస్యలను వెంటనే పరిష్కరించాలి
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

బొంరాస్‌పేట్, జులై 4: రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా వారి సమస్యలను వెంటవెంటనే పరిష్కరించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన దుద్యాల మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. రెవెన్యూ కార్యాలయంలో రికార్డులను తనిఖీచేసి పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను వెంటనే పరిష్కరించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో ఆటంకాలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ధరణిలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, తహసీల్దార్ దానయ్య, మాజీ సర్పంచ్ ఖాజమీయ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు పరిష్కారం

జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం గురువారం ఒక్క రోజే పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత సమస్యలకు అధికారులు పరిష్కరించారు. ఒక్క రోజే 37 సమస్యలను పరిష్కరించినట్లు తహసీల్దార్ దానయ్య తెలిపారు.



ప్రతీ వానాకాలంలో నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమం కాంగ్రెస్ ప్రభుత్వంలో వన మహోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఏటా లక్షల్లో మొక్కలు నాటి పెంచుతున్నారు. ఈ సారి కూడా జిల్లాలో 27లక్షల మొక్కలను నాటాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో నాటేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. వర్షాలు పడితే ఇప్పటికే కార్యక్రమం మొదలయ్యేది. కానీ భారీ వర్షాలు కురియక మొక్కలు నాటడం ఆలస్యమవుతోంది. ఈ నెల మొదటి వారం నుంచి కార్యక్రమాన్ని ఉధృతం చేయాలని అధికారులు భావిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖల ఆధ్వర్యంలో మొక్కలను నాటిస్తారు. జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు, 566 పంచాయతీల్లో మొక్కలు నాటేందుకు ఖాళీ స్థలాలను గుర్తిస్తున్నారు.



వన మహోత్సవానికి సన్నద్ధం

- 566 పంచాయతీల్లో కొనసాగుతున్న నర్సరీలు
- డీఆర్‌డీఏ, అటవీ శాఖల ఆధ్వర్యంలో కార్యక్రమ నిర్వహణ
- వానలు పడడమే తరువాయి
- ఈ వారంలోనే మొక్కలు నాటేందుకు కార్యాచరణ
- ఖాళీ స్థలాల గుర్తింపును ముమ్మరం చేసిన అధికారులు

జిల్లాలో 27లక్షల మొక్కలు నాటడం లక్ష్యం

పరిగి, జూలై 4 : జిల్లాలో ఈ ఏడాది మొక్కలు నాటే కార్యక్రమానికి అధికార యంత్రాంగం సన్నహాలు చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మొదటిసారి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎనిమిది విడతలుగా ఏటా వానాకాలం ప్రారంభంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇప్పుడు హరితహారం పేరును వన మహోత్సవంగా మార్చి తొమ్మిదో విడతలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. జూలై మొదటి వారంలో జిల్లాలో వన మహోత్సవం కింద మొక్కలు నాటేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయగా, వర్షాలు సరిగ్గా కురియక మొక్కలు నాటడం ఆలస్యమైంది. ప్రతీ పంచాయతీలో నిర్వహిస్తున్న నర్సరీల్లో నాటేందుకు మొక్కలు సిద్ధం చేశారు. ఈ సారి జిల్లాలో 27లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు అధికారులు నాటించేందుకు మొక్కలను సిద్ధం చేస్తున్నారు. వన మహోత్సవాన్ని నిర్వహించేందుకు అధికారులు సమీక్షలు కూడా నిర్వహించారు. ఈ నేపథ్యంలో గత ఏడాది నాటకుండా నర్సరీల్లో మిగిలిపోయిన మొక్కలను కూడా ఈసారి నాటించాలని అనుకుంటున్నారు. మొక్కలు నాటే స్థలాలను గుర్తించాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేస్తున్నారు. గుర్తించిన ప్రదేశాల్లో జూన్ నుంచే మొక్కలు నాటించేందుకు అటవీ, ఇతర శాఖల అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని 20 మండలాలు, వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూరు మున్సిపాల్టీలు అలాగే 566 పంచాయతీలు ఉన్నాయి. 3,386 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో ఉన్న జిల్లాలో ఈ ఏడాది వన మహోత్సవ కార్యక్రమం కింద 27లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు అవసరమైన ప్రదేశాలను ఎంపిక చేస్తున్నారు. మండలానికి ఒక అధికారికి చొప్పున బాధ్యతలు అప్పగించనున్నారు. గ్రామాల్లో ఉన్న ఖాళీ స్థలాలను, అటవీ శాఖ, ఆలయాలు, పరంపోగు భూముల్లో, గ్రామీణ, ఇతర ప్రధాన రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించారు. గతేడాది కంటే ఈ సారి ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటాలని అధికారులు భావిస్తున్నారు.



నర్సరీలో పెంచుతున్న మొక్కలు

మొక్కలు నాటేందుకు స్థలాల గుర్తింపు

అటవీ, డీఆర్‌డీఏల ఆధ్వర్యంలో 27లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఐదు లక్షలు అటవీ శాఖ, 22లక్షలు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పరిగి, వికారాబాద్, తాండూరు, ధారూర్, కొడంగల్‌లలో అటవీ రేంజ్‌లు ఉన్నాయి. ఇందుకు రేంజ్‌ల వారీగా మొక్కలను నాటించి పెంచాలని నిర్ణయించాయి. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో నర్సరీలను పెట్టి మొక్కలు పెంచుతున్నారు. ఈ మొక్కలను నాటించేందుకు జిల్లాలోని ఐదు రేంజ్‌ల రేంజర్లు, సెక్షన్/బీట్ అధికారులు కలిసి స్థలాలను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే నర్సరీల నుంచి గ్రామాలకు చేరవేసేందుకు మొక్కలను సిద్ధంగా ఉంచారు. అలాగే డీఆర్‌డీఏ శాఖ అధకారుల ఆధ్వర్యంలో డీఆర్‌డీవో, ఏపీడీల అధ్వర్యంలో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే ఉపాధి హామి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను రంగంలోకి దింపారు. గ్రామల్లో అనువైన స్థలాల్లో మొక్కలు నాటించే పనుల్లో ఇప్పటి నుంచే నిమగ్నమయ్యారు.

మొక్కలను సిద్ధం చేస్తున్నాం



జిల్లాలో వన మహోత్సవంలో భాగంగా 20 మండలాల పరిధిలో గల 566పంచాయతీల్లో మొక్కలు నాటేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. అన్ని పంచాయతీల్లో నర్సరీలను ఏర్పాటు చేశారు. ఈ వన నర్సరీల్లో మొక్కలు పెరిగి సిద్ధంగా ఉన్నాయి. వానలు కురవడమే తరువాయి. పెద్ద సంఖ్యలో మొక్కలు నాటుతాం. డీఆర్‌డీఏ శాఖ 22లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకుంది. 15లక్షల మొక్కలను రోడ్లు, ఖాళీ స్థలాల్లో నాటిస్తాం. ఏడు లక్షల మొక్కలను ఇళ్ల వద్ద నాటేందుకు ప్రజలకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

- శ్రీనివాస్, పీడీ-డీఆర్డీఏ, వికారాబాద్ జిల్లా

అటవీ శాఖకు 5 లక్షల మొక్కలు టార్గెట్



ఈ సారి అటవీ శాఖ ఆధ్వర్యంలో 5లక్షల మొక్కలను నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం. జిల్లాలో ఐదు రేంజ్‌లు ఉన్నాయి. ఇప్పటికే నర్సరీల్లో మొక్కలను రెడీ చేశాం. గతేడాది మిగిలిపోయిన మొక్కలను కూడా నాటించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వర్షాలు పడగానే వన మహోత్సవానికి శ్రీకారం చుడతాం.

- జ్ఞానేశ్వర్, డీఎఫ్‌వో, విరాబాద్ జిల్లా

సస్పెన్షన్ బేఖాతర్!

- ఈ నెల 2న వికారాబాద్, తాండూరు ఎఫ్ఆర్వోల సస్పెన్షన్
- సస్పెన్షన్ తర్వాత జిల్లా స్థాయి సమీక్షకు హాజరైన అధికారి



సమీక్ష సమావేశంలో డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్‌తో కలిసి పాల్గొన్న ఎఫ్ఆర్‌వో అరుణ

వికారాబాద్, జూలై 4: సాధారణంగా సస్పెండైన అధికారులు సస్పెన్షన్ ఎత్తేసే వరకు కార్యాలయానికి రారు. కానీ రెండు రోజుల కిందట సస్పెన్షన్ వేటుపడ్డా గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశానికి సస్పెన్షన్‌కు గురైన అధికారి హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. వికారాబాద్‌లో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో జిల్లా అటవీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా ఎఫ్ఆర్వోను సస్పెండ్ చేస్తూ ఈ నెల 2వ తేదీన ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) రాకేష్‌మోహన్ డోబ్రియాల్ ఉత్తర్వులు జారీ చేసినా సదరు ఉద్యోగి సమావేశంలో పాల్గొన్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అటవీ శాఖలో తునికాకు సేకరణకు సంబంధించి 2017-18, 2019-20, 2020-21లలో అటవీ శాఖకు లాభాలు రాగా కూలీలకు బోనస్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో వికారాబాద్ జిల్లాకు సంబంధించి రూ.53లక్షలు విడుదల చేశారు. అయితే ఈ నిధులను ఆయా రేంజ్ పరిధి అధికారులు కాజేయాలని చూడడంతో 'ఆంధ్రజ్యోతి'లో మే 28న 'బోనస్ మింగేశారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో జూన్ 3న విజిలెన్స్ డీఎఫ్‌వో రాజశేఖర్ విచారణ చేసి నివేదిక ఇవ్వడంతో ఈ నెల 2న వికారాబాద్, తాండూరు ఎఫ్ఆర్‌వోలు అరుణ, శ్యాంసుందర్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉంటే గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సుధీర్‌కుమార్ వన మహోత్సవంపై సమీక్ష సమావేశం నిర్వహించగా దీనికి డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్, ఇతర అధికారులు వచ్చారు. సస్పెండ్ అయిన వికారాబాద్ ఎఫ్ఆర్‌వో అరుణ సైతం దర్శనమిచ్చారు. ఈ నెల 2నే అరుణ సస్పెండ్‌పై డీఎఫ్‌వోకు ఉత్తర్వులు వచ్చాయి.


ఎందుకు కాపాడుతున్నట్లు?

అవినీతి ఆధారాలు రుజువు కావడంతోనే ఎఫ్ఆర్‌వోలను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేసినా ఎవరూ కాపాడుతున్నట్టు? అని జిల్లాలో చర్చ నడుస్తోంది. సస్పెండ్ అయిన అధికారి కార్యాలయానికి రావడం ఏమిటి? జిల్లా స్థాయి సమీక్షలో కూర్చోవడం ఏమిటని గుసగుసలాడుతున్నారు. ఈ అధికారికి అండగా ఎవరు ఉన్నారు? ఏ ధైర్యంతో సస్పెండెడ్ అధికారి ఇలా చేస్తున్నారని చర్చనీయాంశంగా మారింది.

డీఎఫ్‌వో ఆర్డర్ ఇచ్చారా.. లేదా?

ఇద్దరు అధికారుల్ని సస్పెండ్ చేస్తున్నట్లు పైస్థాయి నుంచి రెండు రోజుల క్రితం ఉత్తర్వులు వచ్చినా ఎఫ్ఆర్‌వోలను డీఎఫ్‌వో ఎందుకు వెనకేసుకొస్తున్నారనే చర్చ మొదలైంది. రెండు రోజుల క్రితం ఆర్డర్ కాపీ వచ్చినపుడు బుధవారం ఇవ్వలేదా? గురువారం పత్రికల్లో వచ్చిన కథనాలకైనా తొలగించాలి. కానీ డీఎఫ్‌వో పాల్గొన్న సమీక్షలోనే సస్పెండైన అధికారి ఎలా పాల్గొంటారు? అని చర్చించుకుంటున్నారు. ఉన్నతాధికారుల ఉత్తర్వులకు లెక్కేలేదా? వాటిని బేఖాతర్ చేస్తున్నారా? అని అనుకున్నారు. ఈ విషయమై డీఎఫ్‌వో వివరణకు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.

అంగన్‌వాడీలో కుళ్లిన గుడ్లు!



కుళ్లిన గుడ్లు ఇవే..

దోమ, జూలై 4: గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం కోడిగుడ్లను పంపిణీ చేస్తోంది. కాంట్రాక్ట్ తీసుకున్న ఏజెన్సీల ద్వారా అంగన్‌వాడీలకు కోడిగుడ్లను ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ఇందులో భాగంగానే దోమ అనుబంధ గ్రామం ఉదన్‌రావుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు గురువారం కోడిగుడ్లను పంపిణీ చేశారు. చిన్నారులు గుడ్లను ఇంటికి తీసుకెళ్లిన నీళ్లలో వేసి చూడగా అవి తేలాయి. లబ్ధిదారులు వాటిని పగులగొట్టి చూడగా కుళ్లిపోయి దుర్వాసన వచ్చాయి. దీంతో లబ్ధిదారులు ఫొటోలు, వీడియోలు తీశారు. సోషల్ మీడియాలో పెట్టారు. చిన్నారులు కుళ్లినగుడ్లను తిని అనారోగ్యానికి గురైతే ఎవరు బాధ్యత వహిస్తారని అంగన్‌వాడీ టీచర్‌ను తల్లిదండ్రులు ప్రశ్నించారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన గుడ్లనే తాను సరఫరా తాను పంపిణీ చేశానని అంగన్‌వాడీ టీచర్ చెప్పారు. ఇప్పటికైనా ఏజెన్సీలు నాణ్యమైన గుడ్లు సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరారు.



చెరువు కట్ట వద్ద పరిశీలిస్తున్న జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ రంగారెడ్డి

చెరువులను టూరిజం స్పాట్‌లుగా మారుస్తాం

మర్పల్లి, జులై 4 : వికారాబాద్ నియోజకవర్గంలో ఉన్న చెరువులను టూరిజం ప్రదేశాలుగా మారుస్తామని రంగారెడ్డి జిల్లా ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ రంగారెడ్డి అన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశాల మేరకు మర్పల్లి మండలం సిరిపురం, ఈర్లపల్లి, పంచలింగాల, కొంశెట్టిపల్లి, రావుల్‌పల్లి, కోట మర్పల్లి, కల్కోడ, మోమిన్‌పేట్ మండలం చంద్రన్‌సాగర్, బంటారం మండలంలోని మరి కొన్ని చెరువులను గురువారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం చెరువుల పరిస్థితి, నీట మట్టం, పూడికతీత పనులు తదితర అంశాలపై తెలుసుకున్నారు. త్వరలోనే ఈ చెరువులకు ప్రత్యేక నిధులు కేటాయించి ప్రతీ చెరువులో పూడికతీతతో పాటు ఆయకట్టు కింద ఉన్న ప్రతీ ఎకరాకు నీరందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎస్ఈ తెలిపారు. గుర్తించిన సమస్యలపై నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాము, సురేశ్, పాండు, రాచన్న, నర్సింహారెడ్డి, ఉప్పలి రమేశ్, చంద్రయ్య, రాచన్న తదితరులు పాల్గొన్నారు.

చేప పిల్లల విడుదలపై.. నీలి నీడలు!

- ఈ ఏడాది పంపిణీ ఉంటుందా.. లేదా?
- సకాలంలో పంపిణీ చేయకుంటే నష్టమే
- గతేడాది ఆలస్యంగా చెరువుల్లోకి చేప పిల్లలు
- చేపలు ఎదుగక మత్స్యకారులు నష్టాలపాలు



2023-24లో చేప పిల్లల పంపిణీ వివరాలు

మండలం	చేప పిల్లల సంఖ్య	చెరువులు
శామీర్‌పేట	23,04740	68
మేడ్చల్	21,64,230	78
కీసర	4,59,120	25
ఘట్‌కేసర్	4,50,650	18
కుత్బుల్లాపూర్	3,84,154	04
దుండిగల్	6,81,510	24
బాచుపల్లి	78,840	05
అల్వాల్	23,530	02
కాప్రా	1,19,460	07
మేడిపల్లి	39,120	02



మేడ్చల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల కుటుంబాలను ఆదుకోవడంతో పాటు చేపల ఉత్పత్తిని పెంచాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేపపిల్లల పంపిణీ పథకం అమలుపై నీలినీడలు అలముకుంటున్నాయి. ఏటా వర్షాకాలం ప్రారంభం కంటే ముందే చేపపిల్లల ఉత్పత్తి, పంపిణీ బాధ్యతలను టెండర్ ప్రక్రియ ద్వారా అప్పగించేవారు. చెరువు కుంటల్లోకి నీరు రాగానే చేప పిల్లలను వదిలేవారు. ఈ ఏడాది ఇంత వరకూ టెండర్ ప్రక్రియ ప్రారంభించలేదు. మేడ్చల్ జిల్లాలో 333చెరువులు, కుంటలు ఉన్నాయి. 2023-24లో జిల్లాలోని 233 చెరువులకు వంద శాతం సబ్సిడీతో 68.05లక్షల చేప పిల్లలను వదిలారు. ఈ ఏట చెరువుల్లో చేప పిల్లలను సకాలంలో వేయకపోతే వాటి ఎదుగుదల లేక మత్స్యకారులకు నష్టం వాటిల్లనుంది. కాంట్రాక్టరు సాధారణంగా జూలైలో చెరువుల్లోకి నీరుచేరే సమయంలో చేపపిల్లలు పంపిణీ చేయాలి. అయితే అక్టోబరు వచ్చే వరకు సరఫరా చేయకపోవడంతో చేపల్లో ఎదుగుదల లోపిస్తుంది. 35-40సెం.మీ పొడవు చేప పిల్లలు సుమారు కిలో తూకం బరువు వచ్చే సరికి 8నెలల సమయం పడుతుంది. గతేడాది మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో చేప పిల్లల పంపిణీ ఆలస్యమవడంతో చేపల ఎదుగుదల సరిగ్గా లేక అనేక చెరువుల్లో చేపల వేట నిలిపివేశారు. కొన్ని చెరువుల్లో నీటి కొరతతో వేసిన చేపలు కాస్తా చేతి కందకుండా పోయాయని మత్స్యకారులు వాపోతున్నారు. దీనికితోడు జిల్లా వ్యాప్తంగా గతంలో ఉచిత చేపపిల్లల పంపిణీలో భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి. టెండర్లు దక్కించుకున్న సరఫరాదారులు బరువు, సైజు తక్కువ ఉన్న పిల్లలను తేవడంతో చేపల్లో ఎదుగుదల లేక నష్టాలు ఎదుర్కొంటున్నామని మత్స్యకార సంఘాల నాయకులు వాపోతున్నారు. కాంట్రాక్టర్లు చెప్పిన లెక్కలకు, ప్యాకెట్‌లో ఉండే చేప పిల్లల సంఖ్యకు పొంతనలేదంటున్నారు.ఈ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది చేపపిల్లల సరఫరాదారులతో నిబంధనల ప్రకారం ఒప్పందం కుదుర్చుకోవాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ దీపిక

అవసరమున్న ప్రతీ చోట సీసీ రోడ్లు

మేడ్చల్ టౌన్, జులై 4: మేడ్చల్ మునిసిపల్ పరిధి కాలనీల్లో అవసరమున్న ప్రతీ చోట సీసీ రోడ్లు వేస్తున్నామని మునిసిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపికనర్సింహారెడ్డి అన్నారు. గురువారం 13వ వార్డులో రూ.25లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను చైర్‌పర్సన్, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మునిసిపల్‌లోని అన్ని వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశామని తెలిపారు. ప్రణాళికాబద్ధంగా అన్ని కాలనీల్లో సీసీ రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులపై సమాచారమివ్వండి

హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు

యాచారం, జూలై 4 : గ్రామంలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే తక్షణమే డయల్ 100కు సమాచారమివ్వాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు కుర్మిద్ద గ్రామస్తులకు సూచించారు. కాగా, గ్రామంలో కొన్ని రోజులుగా దొంగలు సంచరించి చోరీలకు యత్నిస్తుండడంతో గ్రామస్తులు కలవరపడుతున్నారు. మంగళవారం రాత్రి ఆనెమోని రోశయ్య ఇంట్లో చోరీకి యత్నించిన దుండగుల కళ్లలో కుటుంబ సభ్యులు కారం పొడి చల్లిన వైనంపై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో దొంగల కంట్లో కారం కొట్టి.. చోరులను ఎదుర్కొన్న కుటుంబం... అనే శీర్షికన వచ్చిన కథనంపై హైదరాబాద్ పోలీసులు స్పందించారు. గురువారం సాయంత్రం సీఐ నర్సింహారావు ఆదేశం మేరకు పోలీసులు కుర్మిద్దలో పర్యటించారు. గ్రామంలో చోరీల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. దొంగల కంట్లో కారంపొడి కొట్టి దుండగులను ఇంట్లోకి రాకుండా అడ్డుకోవడం అబినందనీయమని అన్నారు. దొంగలను ప్రతిఘటిస్తూనే 100 నెంబర్‌కు కాల్ చేసి సమాచారమందించి ఉంటే వారిని సూచించారు. సమాచారమందించిన నిమిషాల వ్యవధిలో గ్రామం చేరుకొని ఆదుకుంటామని వెల్లడించారు. కాగా, రక్షణ కల్పించి ఆదుకోవాలని గ్రామస్తులు పోలీసులను కోరారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కుర్మిద్దలో చోరీలపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పంట సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

● రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి

శంషాబాద్ రూరల్, జూలై 4 : రైతులు పంటల సాగు వివరాలను ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని కవేలిగూడలో పొలాల వద్దకు వెళ్లి రైతులు సాగు చేసే పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో రైతులు సీబీఈ యాప్ ద్వారా పంట సాగు వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. ఫర్టిలైజర్ షాప్‌లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని, బ్లాక్‌లో, గుర్తు తెలియని వ్యక్తుల వద్ద కొనుగోలు చేయవద్దని సూచించారు. మండల వ్యవసాయ అధికారి కవిత, ఏఈవో సురేష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.


కవేలిగూడలో పంటల వివరాలు నమోదు చేస్తున్న గీతారెడ్డి


బండలేమూర్‌లో పనులు ప్రారంభిస్తున్న జడ్పీటీసీ నిత్యనిరంజన్‌రెడ్డి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మంచాల, జూలై 4 : మండల పరిధిలోని బండలేమూర్‌లో రూ.5లక్షల జడ్పీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను జడ్పీటీసీ మర్రి నిత్యనిరంజన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ తన పదవీ కాలం ఈ రోజుతో ముగుస్తుందని తెలిపారు. పేదల కోసం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానన్నారు. మాజీ ఎంపీపీ నర్మదల చ్చిరాం, మాజీ ఎంపీటీసీ మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు శ్రీనివాస్ నాయక్, చంద్రయ్య, కిషన్‌నాయక్, ఐలయ్య, సత్యం తదితరులున్నారు.

దేశవ్యాప్తంగా ప్రగతి వెల్ఫేర్ సొసైటీ సేవలు

● సంస్థ నిర్వాహకులు డాక్టర్ అలోక్ అగర్వాల్

షాద్‌నగర్, జూలై 4 : రెండు దశబ్దాల క్రితం ప్రగతి వెల్ఫేర్ సొసైటీ సేవలను దేశంలోని మారుమూల గ్రామాలకు విస్తరించామని ఆ సంస్థ నిర్వాహకులు డాక్టర్ అలోక్ అగర్వాల్ చెప్పారు. ఇదివరకే రంగారెడ్డి జిల్లాల్లోని ఫరూఖ్‌నగర్, కొందుర్గు, చౌదరిగూడ, షాబాద్ మండలాల్లో తమ సంస్థ సేవలు అందిస్తుందని చెప్పారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామంలోలోని తమ కార్యాలయంలో సేవ విస్తరణ కార్యక్రమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బూర్గులలో విద్య, వైద్యం, గ్రామ ప్రగతికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, మౌలికవసతులు, విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం లాంటి సౌకర్యాలను పాఠశాలలో కల్పించామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో 8 జీపీఏ సాధించిన విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయం అందించామన్నారు. మహిళల కోసం కుట్టు, బ్యాగుల తయారీ లాంటి పనుల్లో శిక్షణ ఇచ్చి వారిని ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేశామని వివరించారు.


మాట్లాడుతున్న అలోక్ అగర్వాల్

వేంకటేశ్వరుడి సేవలో 'టార్జాన్'

షాద్‌నగర్‌అర్బన్, జూలై 4: షాద్‌నగర్ పట్టణానికి ముఖద్వారంగా వెలిసిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని స్వామివారిని గురువారం ప్రముఖ సినీనటుడు టార్జాన్ అలియాస్ లక్ష్మీనారాయణ దర్శించుకున్నారు. షాద్‌నగర్ రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వచ్చిన టార్జాన్ ఆతరువాత మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్‌తో కలిసి ఆలయానికి వచ్చి, స్వామిని దర్శించుకున్నారు. ఆలయాన్ని పరిశీలించి, పురాతన ఆలయానికి పూర్వవైభవం తెచ్చారని అభిప్రాయపడ్డారు. ఆలయ అభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానని టార్జాన్ హామీ ఇచ్చారు.


సినీనటుడు టార్జాన్‌ను సన్మానించిన ఒగ్గు కిషోర్

చెట్లు పెంచేందుకు దరఖాస్తు చేసుకోవాలి

శంకర్‌పల్లి, జూలై 4: ఈత, టేకు చెట్లతో పాటు పండ్ల మొక్కలు పెంచేందుకు ఆసక్తిగా ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ తెలిపారు. శంకర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ వనమహోత్సవంలో భాగంగా ఎస్సీ ఎస్టీలు, 5ఎకరాల లోపు ఉన్న సన్న చిన్నకారు రైతులు ఈత, టేకు, యూకలిప్టస్(నీలగిరి), మునగ, పండ్ల మొక్కలు మామిడి, జామ తదితర మొక్కలు పెంచుకునేందుకు రైతులు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని అన్నారు. మొక్కలు పెంచుకున్నందుకు గాను సంరక్షణ చార్జీ ఒక్కో మొక్కకు రూ. 5 చొప్పున రూ. 3వేలకు మించకుండా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రభుత్వ భూమిపై విచారణ చేపట్టాలి

పూడూరు, జూలై 4: మండలంలోని ఎన్కెపల్లి గ్రామంలో కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిలో రియల్టర్ల నుంచి కాపాడాలని గ్రామస్తులు గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సర్వేనెంబర్-99, 101లో రెవెన్యూ రికార్డుల ప్రకారం 125ఎకరాల భూమి ఉంది. ఈ రెండు సర్వే నెంబర్లలో గతం 60ఏళ్ల నుంచి భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వం సర్టిఫికెట్లతో భూ పంపిణీ చేసింది. ఎక్స్ సర్వీస్‌మెన్‌ల పేర్లతో రియల్టర్లు భూ దందా చేస్తున్నారని, ఇట్టి భూమిపై విచారణ జరపాలని వారు కోరారు. మిగిలిన భూమికి చెందిన రికార్డులను గతంలో పనిచేసిన మండల రెవెన్యూ అధికారులు, రియల్టర్లు, కొందరు గ్రామస్తులతో కలిసి 2018లో గత రికార్డులను తారుమారు చేశారని వారు కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఎకరాలకు రూ.2కోట్ల వరకు ధరలు పలుకుతుండటంతో అన్యాక్రాంతమవుతుందని వారు వాపోయారు. వెంటనే అధికారులు స్పందించి ఇట్టి భూమిపై విచారణ జరిపి, గ్రామ పేదలకు వ్యవసాయానికి గానీ, ఇళ్ల స్థలాల కోసం కానీ కేటాయించి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్కెపల్లి గ్రామస్తులు

సీనియార్టీ ఆధారంగా పదోన్నతులు చేపట్టండి

● రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయుల అప్పీల్ తిరస్కరణ

హైదరాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన పదోన్నతులు, బదిలీలను సీనియార్టీ ప్రకారం చేపట్టాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు సింగిల్ జడ్జి ఉత్తర్వులను సమర్థించింది. ఆ జిల్లాకు చెందిన పలువురు ఎస్జీటీలు దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టేసింది. రంగారెడ్డి జిల్లాకు చాలా మందిని ఇతర జిల్లాల నుంచి బదిలీ చేస్తున్నారని, స్థానికేతర ఉపాధ్యాయుల శాతం 45 శాతానికి మించి పోతోందని పేర్కొంటూ బీ రవి సహా దాదాపు 40 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. క్యాడర్ స్ట్రెంత్ కంటే ఎక్కువ మందిని ఇక్కడికి బదిలీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. 40 పోస్టులు ఆపి, ఇతర జిల్లాల తరహాలో బదిలీలు చేపట్టవచ్చని చెప్పింది. దీనిపై పిటిషనర్లు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేయగా డివిజన్ బెంచ్ సింగిల్ జడ్జి ఆదేశాలను సమర్థించింది. అప్పీల్‌ను కొట్టేసింది.

వర్షానికి కూలిపోయిన ఇల్లు!

● ఆదుకోవాలని బాధితుల వేడుకోలు

చేవెళ్ల, జూలై 4 : ఇటీవల కురిసిన వర్షానికి చేవెళ్ల మండలంలోని ఆలూర్ గ్రామంలో ఓ బండల ఇల్లు కూలిపోయింది. గ్రామానికి చెందిన నరేగూడెం నర్సింలు ఇల్లు రెండు రోజుల క్రితం కురిసిన వర్షం కారణంగా బుధవారం రాత్రి కూలిపోయింది. ఇంట్లో కుటుంబ సభ్యులెవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇంటి యాజమాని నారేగూడెం సుప్రియ, నర్సింలు దంపతులు ఆరేళ్ల క్రితం చనిపోవడంతో వారి పిల్లలను అమ్మమ్మ బేగరి నర్సమ్మ వద్ద ఉంచగా.. ఆమె అదే ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఇల్లు పూర్తిగా కూలిపోయిందని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకొని కొత్త ఇల్లు మంజూరుచేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


ఆలూర్ గ్రామంలో కూలి ఇల్లు వద్ద నర్సమ్మ, పిల్లలు

అటవీ సంపదను కాపాడుకోవాలి

● జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్‌కుమార్


వికారాబాద్: వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్ కుమార్

వికారాబాద్, జూలై 4: జిల్లాలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అటవీ సంపదను కాపాడుకోవాలని జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సుధీర్ కుమార్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం వివిధ అంశాలపై జిల్లా, మండల స్థాయి అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్‌లతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వన మహోత్సవంలో జిల్లాలో ఈసారి 40.48లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వన మహోత్సవంలో నాటిన ప్రతీ మొక్క బతకాలని, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటాలని, ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాల పరిసరాల్లో మొక్కలు నాటాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా అటవీ భూములు అన్యాకాంత్రమవడానికి అవకాశం ఇవ్వకూడదన్నారు. ఎక్కడైనా అన్యాక్రాంతమైనట్లు గుర్తిస్తే వెంటనే రెవెన్యూ, పోలీసు శాఖల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కొత్తగా అటవీ భూములు అక్రమణలపై కఠినంగా వ్యవహరించాలని, అటవీభూముల చుట్టూ సరిహద్దులను ఏర్పాటు చేసుకోవాలని ఆయన ఎఫ్ఆర్‌వోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీపీవో జయసుధ, డీఆర్‌డీఏ అధికారి శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

'లక్ష్మీదేవిపల్లి' నిర్మాణానికి నిధులు తెస్తా

» హిందువులపై రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు బాధించాయి » పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ

కొత్తూర్, జూలై 4 : షాద్‌నగర్ నియోజకవర్గానికి సాగు, తాగు నీరు అందించేందుకు నిర్మించతలపెట్టిన లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని, కేంద్రం నుంచి నిధులు తీసుకొస్తానని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ అన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హిందువులపై చేసిన వ్యాఖ్యలు బాధించాయని ఆమె అన్నారు. ఎంపీగా గెలుపొందిన తర్వాత మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్తున్న డీకే అరుణకు పార్లమెంట్ నియోజకవర్గ ముఖద్వారమైన రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ వద్ద బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎర్రవెల్లి నాగరాజుచారి, మండల శాఖ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో భారీగా స్వాగత ఏర్పాట్లు చేశారు. డీకే అరుణ తిమ్మాపూర్‌కు చేరుకోగానే నాయకులు స్వాగతం పలికి శాలువాలు, పూలమాలతో సన్మానించారు. అనంతరం పక్కనే ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో అరుణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తూర్ చౌరస్తా వద్ద మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో అరుణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి ప్రాజెక్టు నిర్మాణానికి తోడ్పాటు అందిస్తానని స్పష్టం చేశారు. నిధులు తీసుకొచ్చి పార్లమెంట్ పరిధిలో పెండింగ్ పనులను పూర్తి చేస్తానన్నారు. రాహుల్‌గాంధీ ఇటీవల పార్లమెంట్‌లో హిందువులపై చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించిందని డీకే అరుణ గుర్తుచేశారు. మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతానన్నారు. ప్రజలు తనపై నమ్మకం పెట్టుకొని ఎంపీగా గెలింపించారని, వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, సమస్యలు పరిష్కారిస్తానని అన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు ఎన్. శ్రీవర్ధన్‌రెడ్డి, డీకే అరుణ, దేపల్లి అశోక్‌గౌడ్, కడెంపల్లి సదానంద్‌గౌడ్, అమడపురం నర్సింహగౌడ్, కమ్మరి భూపాలచారి, భాస్కర్, లక్ష్మణ్, రణధీర్‌గౌడ్, బావండ్ల మాణిక్యం, చెట్ల వెంకటేష్, మల్‌చలం మురళి, వంశీ, వెంకటేష్‌యాదవ్, నర్సింహయాదవ్, ప్రవీణ్, శ్రీశైలంగౌడ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



డీకే అరుణను గజమాలతో సన్మానిస్తున్న బీజేపీ శ్రేణులు



శంకర్ లాల్ చౌరాసియాను సన్మానిస్తున్న సీడీపీవో నాగమణి

అప్రమత్తతతోనే కల్తీ నియంత్రణ

షాద్‌నగర్ అర్బన్, జూలై 4: ప్రజలు అప్రమత్తంగా ఉంటూ.. ప్రశ్నించినప్పుడే కల్తీ వస్తువుల విక్రయాలు నియంత్రించబడుతాయని తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ శంకర్ లాల్ చౌరాసియా తెలిపారు. షాద్‌నగర్ వినియోగదారుల సమాచార కేంద్రంలో గురువారం ఆహార కల్తీలపై అవగాహన సదస్సును నిర్వహించారు. శంకర్‌లాల్ హాజరై మాట్లాడారు. కల్తీ వస్తువుల విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవడానికి వినియోగదారుల చట్టం-2019 ఉన్నప్పటికీ.. సమాజంలో కల్తీ జరుగుతూనే ఉందన్నారు. ప్రజల్లో చైతన్యం వచ్చి, ప్రశ్నించినప్పుడే కల్తీ అరికట్టబడుతుందని అభిప్రాయపడ్డారు. ఏ వస్తువులను కొనాలన్న ఎమ్మార్పీతో పాటు ఎక్స్‌పైరీ డేట్‌ను చూడాలని సూచించారు. సమాఖ్య రాష్ట్ర వైస్ చైర్మన్ దిడ్డి గోపాల్‌నారాయణ్ మాట్లాడుతూ మంచి నూనెతో పాటు ఇతర ఆహార వస్తువులను కల్తీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడైన కల్తీ జరినట్లు తెలిస్తే ఫిర్యాదు చేయాలన్నారు. షాద్‌నగర్ సీడీపీవో నాగమణి మాట్లాడుతూ కల్తీ నివారణ కోసం ప్రజల్లో చైతన్యం తేవడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. వినియోగదారుల సంఘం మీడియా ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధాత్రీదేవి

సహకార సంఘం అభ్యున్నతికి కృషి

మంచాల, జూలై 4 : ప్రత్యేక కార్యాచరణతో సహకార సంఘ అభ్యున్నతికి చర్యలు తీసుకుంటామని జిల్లా సహకార సంఘ అధికారి ధాత్రీదేవి తెలిపారు. గురువారం ఏర్పాటుచేసిన మంచాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతు భరోసా, ఎరువులు, విత్తనాలు, స్వల్ప, దీర్ఘకాలిక రుణాలపై రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. పీఏసీఎస్ డైరెక్టర్లు వెంకటేష‌యాదవ్, యాదయ్య, పి.రమేష్, సత్యనారాయణ, వేణుగోపాల్‌రావు, సీఈవో శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ రమేష్, వ్యవసాయాధికారి జ్యోతిశ్రీ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

సీజీఆర్ ఆధ్వర్యంలో ఔషధ మొక్కల పంపిణీ

కడ్తాల్, జూలై 4: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్రే కీలకమని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ప్రతినిధులు విశ్వేశ్వర్ రావు, వర్థన్, నగేశ్‌లు అన్నారు. మొక్కల పెంపకం ప్రాధాన్యత గూర్చి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించాలని వారు కోరారు. మండలంలోని అన్మాస్‌పల్లి సమీపంలోని ది ఎర్త్ సెంటర్ ఆధ్వర్యంలో స్కూల్ ఎర్త్‌క్లబ్, యంగ్ ఎర్త్‌లీడర్స్ కార్యక్రమంలో భాగంగా ఇర్విన్ ఉన్నత పాఠశాలకు 22 రకాల ఔషధ మొక్కలను సమకూర్చారు. కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ నిర్వాహకురాలు లీలాలక్ష్మారెడ్డి వాటిని ఉపాధ్యాయులకు అందజేశారు. గురువారం పాఠశాల ఆవరణలో మెడిసినల్ గార్డెన్ తయారు చేసి విద్యార్థులు ఔషధ మొక్కలను నాటారు. హెచ్ఎం పర్వతాలు, టీచర్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

షాద్‌నగర్, జూలై 4: సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వసతిగృహాల ప్రిన్సిపాల్లను ఆదేశించారు. గురువారం షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సాంఘిక, గిరిజన, మైనార్టీ, కేజీబీవీ, బీసీ వసతి గృహాల ప్రిన్సిపాల్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వసతి గృహాల్లోని విద్యార్థులు ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ విద్యనభ్యసిస్తుంటారని, అలాంటి నిరుపేద విద్యార్థులకు మరిన్ని వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రిన్సిపాల్లపై ఉందన్నారు. వసతిగృహాలకు సంబంధించి ఎలాంటి సమస్యలున్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని చెప్పారు. వసతిగృహాలు, ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దాలని సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు అల్పాహారం, భోజనం అందించాలన్నారు. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై తనకు నివేదిక అందజేయాలని సూచించారు.

కొత్త జీపీలకు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించండి

షాద్‌నగర్ అర్బన్, జూలై 4: రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన కొత్త గ్రామ పంచాయతీలలో జాతీయ ఉపాధి హామీ పథకం అమలు కోసం ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్‌రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షాద్‌నగర్‌లో గురువారం నిర్వహించిన ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్ల సమావేశానికి హాజరై మాట్లాడారు. ఉపాధి హామీ పథకం సీనియర్ మేట్లను ఫీల్డ్ అసిసెంట్లుగా పదోన్నతి కల్పించి రూ.24వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. జగన్, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఎన్.రాజు, వ్యవసాయ కార్మిక సంఘం నియోజక వర్గం కన్వీనర్ శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రాములు

మండల పరిషత్తుల్లో కొలువుదీరిన ప్రత్యేకాధికారులు

వికారాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్తుల్లో ప్రత్యేకాధికారులు కొలువుదీరారు. ఈనెల 3వ తేదీన మండల పరిషత్తు పాలక వర్గాల పదవీకాలం ముగియడంతో వారి స్థానాల్లో ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్ ప్రతీక్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. వికారాబాద్ మండలానికి జడ్పీ సీఈవో ఎం.సుధీర్‌ను నియమించగా, ధారూరు మండలానికి జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి కె.మల్లేశం, కోట్‌పల్లి మండలానికి ముఖ్య ప్రణాళికాధికారి అశోక్, మర్పల్లి మండలానికి జిల్లా సహకార అధికారి ఈశ్వరయ్య ప్రత్యేకాధికారులుగా నియమితులయ్యారు. బంట్వారం మండలానికి జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి శంకర్ నాయక్, మోమిన్‌పేట్ మండలానికి జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య, పరిగి మండలానికి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్, దోమ మండలానికి జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి హనుమంతరావు, కులకచర్ల మండలానికి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబూ మోజెస్, పూడూరు మండలానికి జిల్లా పంచాయతీ అధికారి జయసుధలను ప్రత్యేకాధికారులుగా నియమించారు. కొడంగల్ మండలానికి జిల్లా అటవీశాఖ అధికారి జి.జ్ఞానేశ్వర్, దౌల్తాబాద్ మండలానికి పశుసంవర్ధక శాఖ ఏడీ సదానందం, బొంరాస్‌పేట్ మండలానికి సర్వే, ల్యాండ్ రెవెన్యూ ఏడీ ఎం.రాంరెడ్డి, తాండూరు మండలానికి జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ అధికారి ఎంఏ సత్తార్, పెద్దేముల్ మండలానికి గనుల శాఖ ఏడీ సత్యనారాయణ, యాలాల్ మండలానికి మార్కెటింగ్ ఏడీ సారంగపాణి, బషీరాబాద్ మండలానికి జిల్లా ఆడిట్ అధికారి వీరభద్రరావు, నవాబ్‌పేట్ మండలానికి జిల్లా వ్యవసాయాధికారి గోపాల్‌లను నియమించారు. మండల పరిషత్తు పాలకవర్గాల పదవీకాలం బుధవారం ముగియడంతో మండలాలకు నియమించిన ప్రత్యేకాధికారులు గురువారం బాధ్యతలు చేపట్టారు. కాగా, జిల్లా ప్రజాపరిషత్తు పాలక వర్గం పదవీ కాలం గురువారం ముగియగా, పాలక వర్గం స్థానంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేకాధికారిగా కొనసాగనున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడితే శుక్రవారం జిల్లా కలెక్టర్ జడ్పీప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. పాలకవర్గాలకు ఉండే అధికారాలన్నీ ప్రత్యేకాధికారులకు ఉంటాయి. నిధుల కేటాయింపు, పనుల ఎంపిక తదితర వ్యవహారాలను ప్రత్యేకాధికారులే పర్యవేక్షించాల్సి ఉంటుంది. పట్నం సునీతారెడ్డి వరుసగా మూడు పర్యాయాలు జడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికై హాట్రిక్ సాధించారు. రెండు పర్యాయాలు రంగారెడ్డి జిల్లా నుంచి, ఒకసారి వికారాబాద్ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్‌గా ఆమె బాధ్యతలు నిర్వర్తించారు.

చంద్రబాబును కలిసిన మాజీ ఎంపీ రాములు



ఆమనగల్లు, జూలై 4: ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గురువారం నాగర్ కర్నూల్ మాజీ పార్లమెంట్ సభ్యుడు పోతుగంటి రాములు మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని ఏపీ భవన్‌లో కలిసి చంద్రబాబు నాయుడును పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నట్లు మాజీ ఎంపీ రాములు తెలిపారు.

మతిస్థితిమితం లేని గర్భిణీ సఖి సెంటర్‌కు తరలింపు

చేవెళ్ల, జూలై 4 : మతిస్థిమితం లేని గుర్తుతెలియని 9 నెలల గర్భిణీని సఖి సెంటర్‌కు తరలించిన సంఘటన గురువారం చేవెళ్ల మండల పరిధిలోని ఎన్కెపల్లి సమీపంలో చోటు చేసుకుంది. గుర్తుతెలియని మహిళ మతిస్థిమితం లేకుండా ఎన్కెపల్లి పరసరాల్లో తిరుగుతుండటంతో గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు గమనించి అంగన్‌వాడీ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధకు సమాచారం అందించారు. ఆమె పోలీస్‌ల సహకారంతో ఎన్కెపల్లి గేట్ వద్దకు వెళ్లి గర్భిణీని సఖి సెంటర్‌కు వాహనంలో తరలించారు. కాగా, గర్భిణీ ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదని, తెలుగు మాట్లాడటం రావడం లేదని అంగన్‌వాడీ అధికారులు తెలిపారు. పోలీస్‌లు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కులు, గ్రామస్తులు ఉన్నారు.



మతిస్థిమితం లేని మహిళను సఖి సెంటర్‌కు తరలిస్తున్న పోలీస్‌లు, అంగన్‌వాడీ సిబ్బంది



ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్‌ఎస్‌యూ నాయకులు

కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

కొడంగల్, జులై 4: కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని ఆర్ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను గురువారం ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భీమారాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వ పాలనలో ఇప్పటికే 65సార్లు పేపర్ లీకేజీలు జరిగాయని ఆరోపించారు. ఇందుకు బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు. పేపర్ లీకేజీలతో దేశవ్యాప్తంగా 24లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నీట్‌పేపర్ లీకేజీలో అవకతవకలు జరిగాయని స్పష్టమవుతున్నా పార్లమెంట్‌లో దేశప్రధాని నరేంద్రమోదీ చర్చించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నీట్ పరీక్షల్లో జరిగిన పేపర్ లీక్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాలు, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు చంద్రకిరణ్, ఉపాధ్యక్షుడు అశోక్, శేఖర్, శ్రీకాంత్, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

పేద రైతుల భూమిని తీసుకోవడం సరికాదు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

కొడంగల్ రూరల్, జులై 4: అభివృద్ధి పేరుతో పేద రైతుల భూములను తీసుకోవద్దని, కొడంగల్‌లో ఉన్న 702ఎకరాల సీలింగ్ భూములు తీసుకొని అభివృద్ధి చేయాలని సామాజిక ప్రజాసంఘాల నాయకులు అన్నారు. స్థానిక ఐబీలో గురువారం వారు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. మూడు నెలల నుంచి కొడంగల్ మండలం అప్పాయిపల్లి గ్రామశివారులో గల సర్వే నెం.19లో సాగు చేసుకుంటున్న పేదల భూములను తీసుకుంటామని అధికారులు ఒత్తిడికి గురిచేయడం సరైంది కాదన్నారు. కొడంగల్‌లో ఉన్న 702ఎకరాల ప్రభుత్వ సీలింగ్ భూములను వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఆ భూముల్లో మెడికల్, పారా మెడికల్ కళాశాలలు, ఆస్పత్రులు, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం కావడం పట్ల హర్షిస్తున్నామని, అయితే, పేద రైతులను అన్యాయానికి గురిచేసే విధంగా భూములను తీసుకోవడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా సీఎం స్పందించి అన్యాక్రాంతమైన సీలింగ్ భూములను స్వాధీనం చేసుకుంటే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రైతు కూలీ పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యం.వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, దేవినోనిగూడ వెంకటయ్య, ఎరన్‌పల్లి శ్రీనివాస్, రమేశ్ బాబు, చిన్నికృష్ణ, సూర్యనాయక్, మైలారం శ్రీనివాస్, రంగారెడ్డిపల్లి కిష్టయ్య, సర్వే నెం.19 భూ నిర్వాసితులు పకీరప్ప, అగ్గనూర్ మల్లేశ్, దుబ్బ బుగ్గప్ప, అమృతప్ప, కమలమ్మ, బుగ్గమ్మ పాల్గొన్నారు.

గాడితప్పిన కాంగ్రెస్ ప్రజాపాలన

» అభివృద్ధిని పక్కన పెట్టి.. ఎమ్మెల్యేలను చేర్చుకోవడంపై దృష్టి
» సబితారెడ్డి పార్టీ మారే ప్రసక్తే లేదు
» విలేకరుల సమావేశంలో పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి



మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

చేవెళ్ల, జూలై 4 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను గాలికి వదిలేసి.. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకోవడం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. గురువారం చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్, నవాబ్‌పేట్ తదితర మండలాల బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి చేవెళ్ల మండలంలోని బర్కల రాంరెడ్డి ఫామ్‌హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలన గాడి తప్పిందని, ఇచ్చిన హామీలను పక్కన పెట్టి ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపైనే దృష్టి పెట్టిందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్‌లో గెలిచిన చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య కాంగ్రెస్‌లో చేరడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని, పార్టీ విడిచి పెట్టిపోయినంత మాత్రాన ఓటర్లు, కార్యకర్తలు ఆయన వెంట పోలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో 111ను ఎత్తివేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం జీవో పరిధిలో ఉన్న అన్ని గ్రామాలను నివాసయోగ్య జోనల్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే యాదయ్య హైదరాబాద్-బీజాపూర్ రహదారి పనులు ప్రారంభించేలా పాటుపడాలని, నాలుగు లేన్ల విస్తరణ పనులు తొందరగా మొదలు పెట్టకుంటే ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే సబితారెడ్డి పార్టీ మారే ప్రసక్తేలేదని, బీఆర్ఎస్ పార్టీలో.. కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తామని స్పష్టం చేశారు. పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న కథనాలను కార్తీక్‌రెడ్డి కొట్టిపారేశారు. చేవెళ్ల, షాబాద్ మండలాల మాజీ ఎంపీపీలు బాల్‌రాజ్, అవినాష్‌రెడ్డి, మండలాధ్యక్షుడు ప్రభాకర్, మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.



రోడ్డు పనులకు మరమ్మత్తులు చేస్తున్న నాయకులు

ఐకమత్యంతోనే గ్రామాల అభివృద్ధి

మొయినాబాద్, జూలై 4 : ఐకమత్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పీసీసీ అధికారి ప్రతినిధి గౌరి సతీష్ తెలిపారు. గురువారం మొయినాబాద్ మండలం నక్కపల్లి, ఎతుబార్‌పల్లి, తోలుకట్ట గ్రామలకు వెళ్లే రోడ్డుకు గౌరీసతీష్ తన సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడ ఉన్నా.. ఏ హోదాలో ఉన్నా.. పుట్టిన ఊరును, కన్నతల్లిని ఎప్పటికీ మరవద్దన్నారు. గ్రామాలలోనే ప్రేమానురాలకు కొదువ ఉండదన్నారు. సొంత గడ్డకు సేవచేసే భాగ్యం కలిగినందుకు ఆనందంగా ఉందన్నారు. మూడు గ్రామాల ప్రజల అనుబంధం, ఐకమత్యంతోనే గ్రామలు అభివృద్ధి జరుగుతుందన్నారు. భవిష్యత్‌లో మరింత సేవ చేసేందుకు ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. సీనియర్ నాయకులు షాబాద్ దర్శన్, మండల అధ్యక్షుడు మాణెయ్య, యువజన అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, కిసాన్ సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు బిక్షపతి, సత్యనారాయణ, గౌరి రవి, కృష్ణ, నర్సింలు, దేవదాస్, శ్రీకాంత్, రవి, రాజేశ్, జహంగీర్, బుచ్చయ్య, రాఘవేందర్, పెంటయ్య, గోపాల్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక శాఖకు దిక్సూచి రోశయ్య

షాద్‌నగర్, జూలై 4: ఆర్థిక శాఖకు దిక్సూచి మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆయన 91వ జయంతిని పురస్కరించుకుని గురువారం షాద్‌నగర్ పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఉన్న ఆయన శిలా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక శాఖను గాడిన పెట్టిన ఘనత రోశయ్యకే దక్కుతుందని కొనియాడారు. 9సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీ, ఎమ్మెల్సీ పదవుల్లో ప్రభుత్వానికి వారధిగా ఉండేవారని చెప్పారు. పరిపాలనపై ఏమాత్రం పట్టులేని నేతలు అసెంబ్లీలో అడుగుపెడుతున్నారని, వారంతా కూడా రోశయ్యను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. గత ఐదు సంవత్సరాలుగా రోశయ్య జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న వైశ్య సంఘం అధ్యక్షులు సరాపు రమేష్, ఆగీరు రవికుమార్‌లను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వైశ్య సంఘం ప్రతినిధులు నాగిళ్ల గోపాల్ గుప్తా, కల్వ యాదగిరీష్ తదితరులు పాల్గొన్నారు.



కోనేరు మెట్లబావిని పరిశీలిస్తున్న సబితాఇంద్రారెడ్డి

పురాతన కట్టడాలను కాపాడాలి

మహేశ్వరం, జూలై 4: పురాతన కట్టడాలను కాపాడాలని, భావితరాలకు ఉపయోగపడేలా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి తెలపారు. గురువారం మండల కేంద్రంలోని మెట్లబావి(కోనేరు)ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రాచీన కట్టడం మెట్లబావి శిథిలావస్థకు చేరిన విషయం తెలుసుకొని మరమ్మతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. పనులు తుది దశకు చేరుకున్నట్లు అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. మెట్లబావిని సాధ్యమైనంత త్వరగా సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సబితాఇంద్రారెడ్డి సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా చిలుకవాగు పనులు

» బీజేపీ నాయకుల ఆరోపణ

తాండూరు, జూలై 4: ఏళ్ల తరబడి ఉన్న వరద కష్టాలను చెక్ పెట్టేందుకు చిలుక వాగులో పూడికతీత కబ్జాలు తొలగించాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే ఈ పనులకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. గురువారం చిలుకవాగులో ఇటాచీతో వరదనీరు నిల్వకుండా కాల్వను తవ్వే పనులను మున్సిపల్ అధికారులు, సిబ్బంది దగ్గరుండి చేపట్టారు. ఈ పనులను గురువారం పరిశీలించిన తాండూరు బీజేపీ నాయకులు, కార్యకర్తలు అక్కడికి వెళ్లి తవ్వకాలను తూతూ మాత్రంగా చేపట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వాగు నాలా ఒకచోట ఉంటే మరో చోట నుంచి తవ్వకాలు చేస్తున్నారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం నర్సింహులు, అసెంబ్లీ కన్వీనర్ రజనీకాంత్, కౌన్సిలర్ బాలప్ప, బీజేవైఎం నాయకులు కిరణ్, జగదీష్‌లు ఆరోపించారు. నాలా మార్గంలో అక్రమ నిర్మాణాలను వదిలేసి తవ్వకాలు చేస్తున్నారని, వెంటనే సర్వేచేయాలని వారు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ కాశీనాథ్, కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి ఆర్అండ్‌బి డీఈ శ్రీనివాస్, తాండూరు, యాలాల రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకుని సర్వే చేసి ఆ ప్రకారమే తవ్వకాలు చేసేలా చూస్తామని తెలపడంతో బీజేపీ నేతలు అక్కడి నుంచి వెళ్లారు. తవ్వకాలను మున్సిపల్ యంత్రాగం చేపట్టింది. ఈ పనులు యుద్ధ ప్రతిపాదకన కొనసాగుతున్నాయి. ఈ చర్యలతో వరద కష్టాలు తీరుతాయో? లేదో? వేచి చూడాలి.



బీజేపీ నాయకులను సముదాయిస్తున్న పోలీసులు



ప్రారంభమైన చిలుక వాగు తవ్వకాలు

విద్యాసంస్థల బంద్ విజయవంతం



ఘట్‌కేసర్: ప్రధాని చిత్రపటాన్ని దహనం చేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఘట్‌కేసర్, జూలై 4: నీట్ పరీక్ష అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి నానావత్ శివాజీనాయక్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష అక్రమాలకు నిరసనగా గురువారం దేశ వ్యాప్త విద్యాసంస్థల బంద్‌లో భాగంగా ఘట్‌కేసర్‌లో పాఠశాలలను ఎన్‌ఎస్‌యూఐ, ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘాల నాయకులు మూసివేయించారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్‌లోని జడ్పీ హైస్కూల్ నుంచి స్థానిక అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాస్తారోకో నిర్వహించి ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ కార్యక్రమంలో అనిల్, మనోజ్, శ్రీను, శ్రీకాంత్, ప్రసాద్, కార్తీక్, వినోద్ నాయక్, చింటు, ప్రశాంత్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



పరిగి: పరిగిలో విద్యార్థుల నిరసన

మేడ్చల్ టౌన్: దేశవ్యాప్తంగా నీట్ పరీక్షలు రాసిన విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం ఆగదని ఎస్‌ఎఫ్‌ఐ మేడ్చల్ మండల కార్యదర్శి కిరణ్ అన్నారు. నీట్ విద్యార్థులకు మద్దతుగా ఎస్‌ఎఫ్‌ఐ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం మేడ్చల్‌లోని అన్ని విద్యాసంస్థలను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బంద్ చేయించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మండల కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ.. నీట్ పరీక్షా పేపర్‌లీక్ వ్యవహారంపై పూర్తి విచారణ జరిపి సంబంధిత వ్యక్తులను శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు కళాశాలల ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిగి: విద్యాసంస్థ బంద్ గురువారం విజయవంతమైంది. ఆయా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బంద్‌ను పాటించారు. ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలు బంద్‌ను పాటించారు. ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలు పరిగిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ మాట్లాడుతూ, నీట్, నెట్ వంటి జాతీయస్థాయిపరీక్షల నిర్వహణలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎన్‌టీఏను రద్దు చేసి, విద్యార్థులకు నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్, రమణ, శివ, ప్రవీణ్ పాల్గొన్నారు.

ధారూరు: ధారూరులో ప్రైవేట్ విద్యాసంస్థలు బంద్ పాటించాయి. నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీకేజీకి నిరసనగా నీట్ ప్రవేశ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్‌ఎస్‌యూఐ, ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘాలు విద్యాసంస్థల బంద్‌కు పిలుపు నిచ్చాయి. ఈ మేరకు గురువారం ధారూరులోని ప్రైవేట్ పాఠశాలలను మూసివేసి విద్యార్థులను ఇళ్లకు పంపించివేశారు. కాగా ప్రభుత్వ పాఠశాలలు యథావిధిగా పనిచేశాయి.

తాండూరు: నీట్ అవకతవకలను నిరసిస్తూ పట్టణంలో పీడీఎస్‌యూ, ఎన్‌ఎస్‌యూఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో విజయవంతంగా అన్ని విద్యాసంస్థలను బంద్ చేయించినట్లు పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ తెలిపారు. నీట్ ఎగ్జామ్ రద్దుచేసి వెంటనే మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ తాండూరు మండలం అధ్యక్షుడు సంతు, పీడీఎస్‌యూ జిల్లా సభ్యులు ప్రకాష్, ఎన్‌ఎస్‌యూఐ పెద్దేముల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, యాలాల మండల అధ్యక్షుడు ప్రశాంత్ పాల్గొన్నారు.



తాండూరు: ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

క్రైం కార్నర్

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్



చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మూడుచింతలపల్లి, జూలై 4: చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు శామీర్‌పేట్ పోలీసులు తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లాకు చెందిన ధర్‌మేందర్(27), శేఖర్(40), ప్రశాంత్(29), గణేష్ (28), మహేశ్ (25), సంజీవ(30)లు జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలని ఓ ముఠాగా ఏర్పడి చోరీలు చేసేందుకు నిర్ణయించుకున్నారు. ఈ ముఠా హైదరాబాద్ నుంచి సిద్దిపేట్‌కు వెళ్లే పల్లెవెలుగు బస్సులో ప్రయాణం చేస్తూ శామీర్‌పేట్ మండలంలో బస్సు దిగారు. ముఠాసభ్యులు ఇద్దరిద్దరుగా విడిపోయి శామీర్‌పేట్‌లో తిరుగుతూ ఒక స్క్రాప్ దుకాణంలో చొరబడి తాళం పగలగొట్టి రూంలో ఉన్న వాహనం తాళాలను తీసుకుని ఏపీ 01 టీఏ 0413 నంబరు గల బొలెరో వాహనాన్ని ఎత్తుకెళ్లారు. కాగా పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా బొలెరో, బెలినో కారు వాహనాలకు సంబంధించిన పత్రాలను చూపెట్టకపోవడంతో అనుమానం వచ్చిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విచారణలో తాము బొలెరో వాహనాన్ని దొంగలించినట్లు అంగీకరించారు. దీంతో పోలీసులు శేఖర్‌తో పాటు బొలెరో, బెలినో కారు, ఒక మొబైల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. మిగతా ఐదుగురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. త్వరలోనే వారిని పట్టుకుంటామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుకు వృద్ధురాలు మృతి

పూడూరు, జూలై 4: పాముకాటుకు వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని మేడిపల్లికలాన్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సనువెల్లి చంద్రమ్మ(73) మంగళవారం ఉదయం తన చేనులో కొత్తిమీర కోస్తుండగా ఓపాము తన ఎడమచేతి వేలికి కాటు వేసింది. గమనించిన అక్కడే ఉన్న తోటి కుటుంబీకులు స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వికారాబాద్ మిషన్ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు గాంధీ ఆసుపత్రికి రెఫర్ చేశారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చంద్రమ్మ గురువారం మృతి చెందింది. మృతురాలి భర్త చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి



కొడంగల్‌లో సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్, జులై 4: పేద ప్రజలకు సీఎం సహాయనిధి ఎంతో దోహదపడుతుందని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి అన్నారు. కొడంగల్‌లోని సీఎం నివాసంలో గురువారం కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని 205మంది లబ్ధిదారులకు రూ.కోటీ 39 లక్షలు విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, వివిధ మండలాల కాంగ్రెస్ మండల అధ్యక్షులు నందారం ప్రశాంత్, నర్సింహులుగౌడ్, ఆవుటి శేఖర్, రఘువర్ధన్‌రెడ్డి, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల అభివృద్ధికి కృషి

అంతర్గత రోడ్ల అభివృద్ధితో వివిధ గ్రామాలకు రాకపోకలు సులభతరం అవుతాయని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జి తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం కొడంగల్‌లోని లక్ష్మీపల్లి, రుద్రారం గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి, లక్ష్మీపల్లి, సంగాయిపల్లి గ్రామాల మధ్యలో బ్రిడ్జి నిర్మాణానికి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగడి రైచూర్ గేటు నుంచి రుద్రారం గేటు వరకు డబుల్ రోడ్డుతో రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, టీపీసీసీ ప్రతినిధి ఎండీ.యూసుఫ్, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

బొంరాస్‌పేట్: బొంరాస్‌పేట్, ముద్దాయిపేట మీదుగా జానకంపల్లి కట్ట, మహంతీపూర్, దేవనూర్ వరకు రూ.23 కోట్లతో చేపట్టిన రోడ్డు పనులకు కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి గురువారం భూమిపూజ చేశారు. గతంలో ఈ రోడ్డు మంజూరైన అప్పటి ప్రజాప్రతినిధులు శ్రద్ధ చూపించకపోవడంతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అదేవిధంగా బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 87 మంది లబ్ధిదారులకు తిరుపతిరెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నర్సిములుగౌడ్, ఆవుటి శేఖర్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, రాజేశ్‌రెడ్డి, నర్సింహులు నాయుడు, రాంచంద్రారెడ్డి, మల్లికార్జున్, దేశ్యనాయక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

బొంరాస్‌పేట్ మండలంలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన కాంగ్రెస్ కార్యకర్తల కుటుంబాలను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి గురువారం పరామర్శించారు. దుప్‌చర్లలో ఇటీవల మృతిచెందిన నాగయ్య కుటుంబసభ్యులను పరామర్శించి భరోసా ఇచ్చారు. నాగయ్య పెద్ద కుమారుడికి ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగం లేదా ఆసక్తి ఉంటే ఫార్మసీ విద్య అభ్యసించేందుకు సాయం అందించనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో సమస్యలను ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. జానకంపల్లి గ్రామంలో ఇటీవల తాండూరులో గృహ నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు మృతి చెందిన మోత్కుర్ వెంకటయ్య కుటుంబాన్ని పరామర్శించారు. వెంకటయ్య భార్య, కుమారుడిని పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మండల కేంద్రంలో సీనియర్ నాయకుడు కుమ్మరి కృష్ణకు పితృవియోగం కలగడంతో ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, నర్సిములు నాయుడు, రాజేశ్‌రెడ్డి, సంతోష్, మల్లికార్జున్, రవి గౌడ్, దేశ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



బషీరాబాద్, జూలై 4: ఎక్మాయి గ్రామానికి చెందిన వైష్ణవి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతుంది. ఈ మేరకు మెరుగైన చికిత్స కోసం వైష్ణవి కుటుంబానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి గురువారం రూ.1.45లక్షల విలువైన ఎల్‌వోసీని మంజూరు చేయించి స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మోహన్ తదితరులున్నారు.

టీటీడీపీ అధ్యక్షుడిని నియమించాలి

కొడంగల్, జులై 4: తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిని నియమించాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పార్టీ ప్రచార కార్యదర్శి తలారి శేఖర్ అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికి తెలంగాణలో టీడీపీ బలోపేతంగా ఉందని, పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు రాష్ట్ర అధ్యక్షుడిని నియమించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ తీసుకొని కార్యకర్తలకు మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు ఆశప్ప, శ్రీశైలం, అమిర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య ఆశయ సాధనకు కృషి



వికారాబాద్: దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

వికారాబాద్, జూలై 4: దొడ్డి కొమురయ్య ఆశయసాధనకు కృషి చేస్తామని వికారాబాద్ పట్టణ కుర్మసంఘం అధ్యక్షుడు కృష్ణ తెలిపారు. వికారాబాద్ పట్టణంలోని ఎమ్మార్పీ చౌరాస్తాలో గురువారం దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి సంఘం నాయకులు పూలమాలలు వేసిన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి దొడ్డి కొమురయ్య అని ఆయన కొనియాడారు. వికారాబాద్ పట్టణంలో కొమురయ్య విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బొండాల శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

పరిగి: దొడ్డి కొమురయ్య వర్ధంతిని గురువారం పరిగిలో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో వేర్వేరుగా జరుపుకున్నారు. కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.వెంకటయ్య, మల్లేశ్ నాగేశ్వర్ పాల్గొన్నారు.

తాండూరు: దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలను సీపీఎం, ఎమ్మార్పీఎస్, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాస్, బుగప్ప, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు, నాయకులు దీపక్, కల్యాణ్, నర్సింహులు, రవి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతి సందర్భంగా గురువారం పరిగిలో కురుమ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్, ఉపాధ్యక్షులు వార్ల అంజనేయులు, గొర్రెకాపరుల సంఘం ఉమ్మడి జిల్లా డైరెక్టర్ మల్లేశ్, వై.మల్లేశం, కె.లక్ష్మణ్, ప్యాట నర్సింహులు, వీరన్న, ఆర్.మల్లేశ్, నర్సింహులు, యాదయ్య, శివకుమార్, విష్ణు, రాజు, శివ, అనిల్, శ్రీరాం, మురళీ పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డు కొమురయ్య వర్ధంతిని గురువారం మేడ్చల్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక కురుమ సంఘం నాయకులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి పాల్గొని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కొమురయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు కౌడె మహేష్, శివకుమార్, కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, సత్యనారాయణ, రామస్వామి, సంతోష్‌గౌడ్, రవి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ టౌన్: దొడ్డు కొమురయ్యకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రైతు భరోసాను సాగు భూములకే ఇవ్వాలి

తాండూరు రూరల్, జూలై 4: రైతుభరోసాను సాగు భూములకే ఇవ్వాలని అన్నదాతలు కోరుతున్నారు. పట్టణంలోని ఎల్మకన్నె సహకార సంఘం కార్యాలయంలో గురువారంజిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ చంద్రయ్య ఆధ్వర్యంలో, సంఘం సీఈవో శ్రీనివాస్ అధ్యక్షతన రైతుల నుంచి అభిప్రాయా సేకరణ, సలహాలు, సూచనల సేకరణ సమావేశం నిర్వహించారు. మొత్తం 25 మంది రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. గత ప్రభుత్వం మాదిరిగా ఓపెన్ ప్లాట్లు, రిసార్ట్స్, వ్యవసాయేతర భూములకు ఇవ్వొద్దని సూచించారు. అదేవిధంగా 5ఎకరాల లోపు ఉన్న రైతులకు మాత్రమే రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించాలని కోరారు. రైతుల సూచనలు, సలహాలు, అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని డీసీసీబీ డైరెక్టర్ రవిగౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ స్వరూపారెడ్డి, వ్యవసాయశాఖ ఏడీ రుద్రమూర్తి, ఏఓ రజిత, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, డైరెక్టర్లు సురేందర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, సిద్ధయ్యస్వామి, వడ్ల బిచ్చన్న, అమృతయ్యగౌడ్, పార్వతమ్మ, నాయకులు సంగప్ప, రాజుగౌడ్, శ్రీశైలం గౌడ్, వెంకటేష్, నర్సింహులు, శ్రీధర్ పాల్గొన్నారు.

డెంగ్యూ, మలేరియాపై ప్రజలకు అవగాహన

కొడంగల్ రూరల్, జులై 4: వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ అన్నారు. మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, మున్సిపల్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలమూరు ప్రాజెక్టు సమీక్షలో పరిగి ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి,జూలై 4: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా పరిగికి సాగునీరు తీసుకొస్తామని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సెక్రటేరియట్‌లో గురువారం సాయంత్రం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో జిల్లా నుంచి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రాజెక్టు కింద కేపీ లక్ష్మీదేవిపల్లి దగ్గర రిజర్వాయర్‌ను నిర్మించి అక్కడి నుంచి పరిగికి సాగునీరు తీసుకవచ్చే అంశంపై చర్చించామని తెలిపారు.

ఎస్పీని కలిసిన పరిగి మాజీ ఎమ్మెల్యే



ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహేశ్‌రెడ్డి

పరిగి, జూలై 4: జిల్లాకు ఇటీవల కొత్తగా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నారాయణరెడ్డిని గురువారం పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీని కలిసినవారిలో పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్, నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పి.వెంకటయ్య, బి.రవికుమార్, వెంకటరామకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌లు ఉన్నారు.

బాధ్యతలు చేపట్టిన ప్రత్యేకాధికారులు

స్థానిక సంస్థల పాలన ముగిసింది. ఎంపీపీల పదవీ కాలం పూర్తి కావడంతో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి ఉత్తర్వులు జారీ చేయగా అధికారులు గురువారం బాధ్యతలు స్వీకరించారు.



తాండూరు రూరల్: ప్రత్యేకాధికారి బాధ్యతలు చేపట్టిన జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎండీ.సత్తార్



నవాబుపేట: మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్

పరిగి: మండల ప్రత్యేక అధికారి బాధ్యతలు స్వీకరించిన డీఆర్‌డీవో శ్రీనివాస్





దోమ: మండల ప్రత్యేకాధికారిగా వచ్చిన జిల్లా యూత్ క్రీడల శాఖ అధికారి హనుమంతరావును సన్మానిస్తున్న అధికారులు



శామీర్‌పేట ప్రత్యేకాధికారిగా విచ్చేసిన సైదులును సన్మానిస్తున్న ఎంపీడీవో



ధారూరు: మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న జిల్లా షెడ్యూల్ కులాల సాంఘిక సంక్షేమ అధికారి మల్లేశం



బషీరాబాద్: అధికారులతో చర్చిస్తున్న ప్రత్యేకాధికారి వీరభద్రరావు



మర్పల్లి: మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కోఆపరేటివ్ బ్యాంకు అధికారి ఈశ్వరయ్య

విత్తనాలు మళ్లీ విత్తుతున్న రైతులు



కాశీంపూర్ సమీపంలో మళ్లీ విత్తుతున్న రైతు కుటుంబం

బషీరాబాద్, జూలై 4: వానాకాలం సాగులో ఆది నుంచే రైతులకు కష్టాలు తప్పడంలేదు. సీజన్ ప్రారంభంలో ఓ మోస్తారుగా కురిసినా రెండు, మూడు వర్షాలకు రైతులు విత్తనాలు వేశారు. తర్వాత నెల రోజులవరకు వర్షాల జాడ లేకుండాపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పలు గ్రామాల పరిధిలోని పొలాల్లో విత్తిన పంటలు మొలకెత్తి వాడుముఖం పట్టే దశకు చేరుకోగా, పలు చోట్ల విత్తనాలు సరిగా మొలకెత్తలేదు. దీంతో వర్షాల కోసం ఎదురుచూస్తూ కొందరు రైతులు ఇంతకాలం ఉండిపోయారు. ఇటీవల కురిసిన వర్షానికి విత్తిన పంటలకు మేలు చేయగా, మొలకెత్తని పొలాల్లో మాత్రం రైతులు మళ్లీ విత్తనాలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. బషీరాబాద్ మండలం కాశీంపూర్ సమీపంలో ఓ రైతు కుటుంబం పొలంలో మళ్లీ విత్తనాలు వేస్తూ ఇలా కనిపించారు.


సంక్షిప్తంగా..

- **మోమిన్‌పేట్:** చక్రంపల్లికి చెందిన మాదాపూరం గోపాల్ అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన గుండాల గోపాల్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకటయ్య, శ్రీనివాస్, రాములు, వెంకటప్ప, మల్లయ్య, రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సత్తయ్య పాల్గొన్నారు.
- **పరిగి:** సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎ.తిరుపతిరెడ్డిని కొడంగల్‌లో గురువారం మర్యాదపూర్వకంగా పరిగి మాజీ జడ్పీటీసీ పి.చంద్రయ్య బృందం కలిశారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలన, పథకాల అమలుపై గురించి ఆయనతో చర్చించారు. తిరుపతిరెడ్డిని కలిసినవారిలో దోమ మాజీ ఎంపీపీ రాజగోపాలచారి, వాజీ వార్డు సభ్యులు అంజనేయులు, సర్వర్, అక్బర్, బంగ్లా వెంకటయ్య, అజ్మద్‌లు ఉన్నారు.
- **నవాబుపేట:** వికారాబాద్ జిల్లా నవాబుపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో రెండు రోజులుగా ప్రజాపాలన దరఖాస్తులు అందించేందుకు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్నెట్‌లో సాంకేతిక సమస్య ఉందని అధికారులు తెలపడంతో ఇబ్బందులకు గురవుతున్నామని మండల ప్రజలు వాపోయారు. అధికారులు స్పందించి సాంకేతిక సమస్యను పరిష్కరించాలని కోరారు.

నేడు శామీర్‌పేట కట్టమైసమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు

శామీర్‌పేట, జులై 4: శామీర్‌పేటలోని పెద్ద చెరువు కట్టమైసమ్మ అమ్మవారు ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. హుండీ లెక్కింపు అనంతరం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు పేర్కొంది.

ఘనంగా వివేకానందుడి వర్ధంతి



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

మేడ్చల్ టౌన్, జూలై 4: స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా గురువారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, రజిత వెంకటేష్ ముదిరాజ్, హంసారాణి కృష్ణగౌడ్, నాయకులు మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లేష్, అరుణ్ పాల్గొన్నారు.

తాండూరు డిపోను సందర్శించిన ఆర్ఎం శ్రీలత

తాండూరు, జూలై 4: ఆర్టీసీ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) శ్రీలత అన్నారు. గురువారం ఆమె తాండూరు డిపోను సందర్శించారు. డ్రైవర్, కండక్టర్లతో ఆమె స్వయంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆర్టీసీ సిబ్బందిపై ఎవరైనా దాడులకు పాల్పడితే చట్టపరంగా శిక్షలు ఉంటాయిన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సమత, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇద్దరు వీఆర్‌ఏలకు రికార్డు అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి

బషీరాబాద్, జూలై 04: బషీరాబాద్ మండల రెవెన్యూ కార్యాలయంలో పని చేస్తున్న ఇద్దరు వీఆర్‌ఏలకు ప్రభుత్వం రికార్డు అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తహసీల్దార్ వై.వెంకటేష్ గురువారం తెలిపారు. శ్రీశైలంకు హైదరాబాద్‌లోని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, తలారి గోపాల్‌కు స్టేట్‌ట్యాక్స్ కార్యాలయాల్లో రికార్డు అసిస్టెంట్లుంగా నియమితులైనట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వారికి రిలీవ్ లెటర్లను స్వయంగా అందజేశారు. రెవెన్యూ అధికార సిబ్బంది ఉద్యోగోన్నతిపై వెళ్తున్న ఇరువురికి శుభాకాంక్షలు తెలియజేశారు.

యాప్‌లో ఎస్జీటీ ఉచిత ఆన్‌లైన్ పరీక్షలు

వికారాబాద్, జూలై 4: పట్టణంలోని ఏకేఆర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఎస్జీటీ వారి జూలై 12, 14 తేదిలలో ఉచిత అన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఏకేఆర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బీ.వీ.రమణ తెలిపారు. ఈపరీక్షలు సాయంత్రం 6 గంటల నుంచి 8.30 గంటల వరకు ఉంటాయని ఆయన చెప్పారు. ఈ పరీక్షలు రాసేవారు ప్లేస్టోర్ నుంచి ఏకేఆర్ స్టడీ సర్కిల్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ నిర్వహించే పద్ధతిలోనే ఈపరీక్షలను నిర్వహిస్తామని, వివరాలకు 9441022557[1] ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

కబ్జా భూమిని విడిపించిన తహసీల్దార్

పూడూరు, జూలై 4:ఎన్కెపల్లి గ్రామంలో సర్వేనెంబర్-99/8లో ఒక ఎకరా భూమి భూకబ్జా దారులు ఖబ్జా చేసిన భూమిని గురువారం తహసీల్దార్ రమాదేవికి రైతు శివయ్య ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు తహసీల్దార్ అక్కడికి చేరుకుని శివయ్యకు చెందిన సీలింగ్ భూమిని కబ్జా దారుల నుంచి విడిపించి రైతుకు ఇచ్చారు. ఎవరైనా ప్రభుత్వ భూమిని కబ్జాచేస్తే కఠినచర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

ప్రజలకు సేవ చేయడం సంతోషకరం

పూడూరు, జూలై 4: ప్రజలకు సేవ చేయడం ఎంతో సంతోషకరమని పూడూరు మాజీ ఎంపీపీ ఎం.మల్లేశం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల ప్రాదేశిక సభ్యుల పదవీకాలం ముగియడంతో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎం.మేఘమాల ప్రభాకర్‌గుప్తా, ఎంపీడీవో పాండు, మాజీ మండల ఉపాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అయ్యూబ్, మాజీ ఎంపీటీసీలు సురేందర్ ముదిరాజ్, సల్మాబేగం ఉన్నారు.

బొంరాస్‌పేట్: ఐదు సంవత్సరాల పాటు ప్రజలకు సేవలు అందించిన మండల పరిషత్ ఎంపీపీ, ఎంపీటీసీలను పంచాయతీరాజ్ అధికారులు, సిబ్బంది సన్మానించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ హేమీబాయి, మాజీ వైస్ ఎంపీపీలు శేరి నారాయణరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రావణ్‌గౌడ్‌తో పాటు ఎంపీటీసీలను ఎంపీడీవో వెంకన్న గౌడ్ పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.



బొంరాస్‌పేట్‌లో ఎంపీటీసీలు, ఎంపీపీని సన్మానించిన అధికారులు